కథ

# నమ్మకం

**జె.సునీల్**

"నువ్వేన్నయినా చెప్పు శ్రావ్యా! నిన్ను ఒంటరిగా హైదరాబాద్ పంపించను" వేదాచలం అదే తన తుదినిర్ణయం అన్నట్టుగా చెప్పాడు.

శ్రావ్య తండ్రికేసి బాధగా చూసింది "చాలా మంచి ఉద్యోగం నాన్నా! నా ఫ్రెండ్ లలిత ఆ ఆఫీసులో పనిచేస్తుంది కాబట్టే, ఈ అవకాశం వచ్చింది"

"ఇక ఆ విషయం గురించి చర్చించకు శ్రావ్యా" అనేసి ఆయన పడకగది వైపు నడిచాడు. హాలులో తల్లీ కూతుళ్ళే మిగిలారు.

అరనిముషం నిశ్చలంగా వున్నాక, నీలవేణి కూతురికి దగ్గరగా నడిచింది. ఆమె భుజంమీద చెయ్యేసి పలికింది "ఎందుకనో మీ నాన్నగారికి నువ్వు ఉద్యోగం చేయడం ఇష్టంలేదు. ఆయన నీ పెళ్ళి చేసేసి బాధ్యత తీర్చేసుకోవాలనుకుంటున్నారు"

"కానీ నాకు ఉద్యోగం చేయాలని వుందికదమ్మా" శ్రావ్య గొంతు గాద్గదికమైంది.

"ఆయన మాట విను తల్లీ! పెద్దవాళ్ళెప్పుడూ పిల్లలకు మంచే చెపుతారు" ఆవిడ కూతురిని బుజ్జగించే ప్రయత్నం చేస్తోంది.

"వాళ్ళు మంచి అనుకుంటున్నది, పిల్లల ఇష్టానికి వ్యతిరేకంగా వుంటున్నప్పుడు పెద్దలు కూడా కాస్త ఆలోచించాలి"

"ఆయన ఆలోచించకుండా ఏదీ మాట్లాడరు. నాకా నమ్మకం వుంది"

తల్లి కూడా తండ్రినే సమర్ధిస్తూ మాట్లాడేసరికి, శ్రావ్యకు కోపం తన్నుకొచ్చింది. ఐనా తనేం చేయలేనని తెలిసి తనను తాను సంభాళించుకుంది.

నీలవేణి కూడా హాల్లోంచి వెళ్ళిపోయింది. శ్రావ్య అక్కడే వున్న సోఫాలో కూలబడింది.

"నాన్న నాకు ఏ లోటూ చేయలేదు. కోరినవన్నీ అందిస్తారు. కోరకుండానే అన్నీ సమకూరుస్తాడు. కానీ ఆయనకు తన మీద నమ్మకం వున్నట్టుగా లేదు. నలుగురు మగాళ్ళతో కలిసి ఆడపిల్ల అంతరిక్షానికి వెళ్తున్న ఈరోజుల్లో హైదరాబాద్ పంపించడానికి అంత బాధపడడమెందుకో తనకు అర్ధం కావడం లేదు"

ఆమెకు ఇంట్లో వుండాలనిపించలేదు. నిశ్శబ్దంగా బయటకు నడిచింది. రోడ్డెక్కి పదడుగులు నడిచాకే, తనను తాను ప్రశ్నించుకుంది. ఎక్కడికెళ్ళాలి? ఆ ప్రశ్నతో ఆగిపోలేదు. ఎక్కడికైనా వెళ్ళాలి. కాసేపు రిలాక్స్ కావాలి! మరో పాతిక అడుగులు ముందుకేసాక ఆమెకు గుర్తొచ్చిన పేరు 'మిహిక!'

మిహిక తన బెస్ట్‌ఫ్రెండ్. ఆమె ఎప్పుడూ బేలన్స్‌డ్‌గా వుంటుంది. అందువల్లే తన సర్కిల్‌లో చాలామంది అనేక విషయాల్లో ఆమెనే సలహా అడుగుతూ వుంటారు.

శ్రావ్య మిహిక ఇంటి వైపు అడుగువేసింది.

ఆమె వెళ్ళేసరికి మిహిక ఇంట్లోనే వుంది. తనను చూసి హాల్లో నుండి వాకిట వరకూ ఎదురొచ్చి "హాయ్‌శ్రావ్యా! వాటే సర్‌ప్రయిజ్..చెప్పా పెట్టకుండా వచ్చేసావేంటి?" అంది.

మనసులో బాధ కదలాడుతున్నా, రాని నవ్వును కొని తెచ్చుకుని "చెప్పి మరీ రావాలని రూలేమైనా వుందా?" ఎదురు ప్రశ్నించింది శ్రావ్య.

"రూలేం లేదుగానీ, నీలాంటి వాళ్ళు హఠాత్‌గా వూడిపడితే, నాలాంటివాళ్ళు ఇబ్బందిపడిపోతారు."

"ఎందుకో"

"అమ్మానాన్న ఇంట్లో లేనప్పుడు ఏ బోయ్‌ఫ్రెండ్‌నో పిలుచుకుంటాం. ఆ సమయంలో పానకంలో పుడకలా నువ్వొస్తే కష్టమేగా?!"

శ్రావ్య నవ్వేసి "నీకంత సీన్ లేదులే" అంది.

మిహిక కూడా నవ్వి "సర్లే!..రా కూర్చో" సోఫా చూపించింది.

ఆమె అటుగా నడిచి సోఫాలో కూర్చుంది. మనసులో వేదన మరోసారి గుర్తుకొచ్చింది.

శ్రావ్యా అనీజీగా కదలాడడం గమనించిన మిహిక అడిగింది. "శ్రావ్యా! ఏంటలా వున్నావ్?...ఎనీథింగ్ రాంగ్"

అసలేమీ మాట్లాడాలని లేదు. కానీ ఏదో మాట్లాడితేనే మనసులో బరువు కాస్తయినా తగ్గుతుందేమోననిపిస్తోంది. ఐనా తను వచ్చిందే, కాస్త రిలాక్స్ కావాలనే కదా! అందుకే పలికింది. "మనసేం బాగోలేదు మిహికా"

"ఎందుకని?"

"హైదరాబాద్‌లో ఉద్యోగం వచ్చింది. నాకేమో ఉద్యోగం చేయాలని, అక్కడికి వెళ్ళాలని వుంది ఎందుకనో నాన్నకు నన్ను హైదరాబాద్ పంపించడం ఇష్టంలేదు. ఆయన మొండిగా హైదరాబాద్ వద్దంటే వద్దు అంటున్నారు" ఆ తర్వాత చెప్పలేక ఆగింది శ్రావ్య.

మిహిక అరనిముషం మౌనంగా వుంది. ఆ తర్వాత తలతిప్పి శ్రావ్య ముఖంలోకి చూసింది. "మరిప్పుడేం చేయాలనుకుంటున్నావ్?"

"ఏం చేయాలో తోచడం లేదు. నాకైతే చనిపోవాలని వుంది" శ్రావ్యపెదవులు బిగపట్టింది.

అక్కడ్నుంచి కదిలి ఫ్రిజ్ వైపు నడిచింది మిహిక. ఫ్రిజ్‌లో నుండి కూల్‌డ్రింక్ తీసి గ్లాసులో పోసి తీసుకొచ్చింది. గ్లాసు శ్రావ్యకు అందిస్తూ "తీసుకో" అంది.

అందుకుంది ఆమె. కూల్‌డ్రింక్ సిప్ చేసాకే తనెంత దాహంతో వుందో అర్ధమయ్యింది.

మిహిక సోఫాలో కూర్చుని ఫ్రెండ్ భుజం మీద చెయ్యేసింది. చాలా నెమ్మదిగానే, స్పష్టంగా పలికింది. "మరెప్పుడు చనిపోతున్నావ్ శ్రావ్యా?"

ఆమె ఉలిక్కిపడింది. తను విన్న మాటలు 'నిజమో-కాదో' నిర్ధారణ చేసుకోవడం కోసమన్నట్టు మిహిక ముఖంలోకి చూసింది.

"...చెప్పు..ఎప్పుడు చనిపోవాలనుకుంటున్నావ్?"

"మిహికా!..నువ్వు..నువ్వనేదేమిటి?"

"నువ్వే అన్నావ్‌గా చనిపోవాలనుందని..అదెప్పుడు..అని అడుగుతున్నానంతే" మిహిక చాలా క్యాజువల్‌గానే పలికింది.

ఆమెకు ఏం మాట్లాడాలో అర్ధం కాలేదు. తన మాటలకు మిహిక రియాక్ట్ అయిన విధానం కన్ఫ్యూజింగ్‌గా అనిపించినా, ఫ్రెండ్‌కి కోపం వచ్చిందన్న విషయం అర్ధం చేసుకుంది. అందుకే ఆమెకు సర్ది చెప్పే ధోరణిలో పలికింది. "అదికాదు మిహికా! మనం ఇంత కష్టపడి చదివాం. మరా చదువు సద్వినియోగం చేసుకోవడమంటే ఉద్యోగం చేయడమే కదా?"



"తల్లిదండ్రులు కూడా ఎంతో కష్టపడే మనల్ని చదివించి వుంటారు"

"మరి వాళ్ళైనా మనల్ని కష్టపడి ఎందుకు చదివించినట్టు?!"

"మన భవిష్యత్‌ని చక్కగా మలచడం కోసం"

శ్రావ్యకు ఈసారి కాస్త చిరాకేసింది "నువ్వు కాస్త కన్ఫ్యూజింగ్‌గా మాట్లాడుతున్నావ్ మిహికా! వాళ్ళు మనల్ని కష్టపడి చదివించింది, మన భవిష్యత్ కోసం అయినప్పుడు, మరి ఉద్యోగం చేయనివ్వకపోవటమేమిటి?"

హాలులోని గాలి గాఢతను సంతరించుకుంటున్న అనుభూతి. జీవిత సత్యాలను విని, వాస్తవాలను గ్రహించాలన్న తపన ఆ గాలికే వుందేమో!

మిహిక పెదవి విప్పింది. "తమకు మరింత స్వేచ్ఛ ఇవ్వడం లేదని, అడిగినవన్నీ సమకూర్చిపెట్టడం లేదని తల్లిదండ్రులను బెదిరించే పిల్లల సంఖ్య రోజురోజుకి పెరుగుతోంది. ఆత్మహత్య చేసుకోవడం, చేసుకుంటామని బెదిరించడం మామూలైపోయింది. మనం బెదిరిస్తే వాళ్ళు బెదిరిపోతారు. అయిష్టంగానైనా మన కోరికలు తీరుస్తారు. కానీ మనం వారిని బెదిరించి కోరికలు తీర్చుకోవాలనుకోవడమో లేదా వారికి శాశ్వతంగా దూరం కావాలనుకోవడమోకాక..వాళ్ళు అలా ఎందుకు చేస్తున్నారో తెలుసుకునే ప్రయత్నం ఎందుకు చేయకూడదు?"

శ్రావ్య ఒక్కక్షణం చిన్న జర్క్‌లా ఫీలయ్యింది. "నిజమే! తను ఏదడిగినా కాదనకుండా అందించే తల్లిదండ్రులు, హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తానంటే ఎందుకు వద్దంటున్నారు?"

ఆమె మెల్లగా గొంతు పెగల్చుకుని "నిజమే మిహికా! నేనీ కోణంలో ఆలోచించలేదు. వాళ్ళు వెళ్ళొద్దంటున్నారని ఉక్రోషపడుతూ, ఆవేశపడుతున్నాననే తప్ప, ఎందుకు వద్దు? అని ఆరాగా అడగలేదు. అడిగితే చెప్పి వుండేవాళ్ళేమో" ఎటో చూస్తూ పలికింది.

మిహిక వెంటనే అంది "చెప్పలేకపోయి వుండొచ్చు కూడా!"

శ్రావ్య తల తిప్పి మిహిక ముఖంలోకి చూసింది. "హైదరాబాద్‌కి పంపించకపోవడానికి గల కారణం - చెప్పలేనంత ఇబ్బందేముంటుంది?"

మిహిక అదోలా నవ్వింది "నిజంగానే చాలా మంది తల్లిదండ్రులు పిల్లల నుండి తామేం ఆశిస్తున్నారో అర్థమైనా, ఆ విషయాన్ని పిల్లలకు అర్థమయ్యేలా చెప్పలేక మానసికంగా నలిగిపోతున్నారు"

"నాకేమీ అర్థం కావడం లేదు"

"పెద్దలను అర్థం చేసుకోవాలనే ఆలోచన పిల్లలకు వుండటం లేదు. ఒక్కసారి నువ్వెళ్ళి నీ తల్లిని, నిన్ను హైదరాబాద్ ఎందుకు పంపించటం లేదో అడిగిచూడు...మీ మధ్య ఏర్పడిన ఆ కమ్యూనికేషన్ గ్యాప్ తొలగించు. వారి మనసులోని వేదన నీకూ అర్థమవుతుంది"

శ్రావ్య మిహికకేసి కొద్దిక్షణాలు అదోలా చూసి, అక్కడి నుంచి బయటకు నడిచింది.

ooo

భోజనాలు ముగిసాయి. తన తండ్రి పడకగదిలోకి వెళ్ళాక, శ్రావ్య, మెల్లగా వంట గది వైపు నడిచింది. వంట పాత్రలు కడుక్కుంటున్న తల్లి దగ్గరగా వెళ్ళి "అమ్మా" అంది.

నీలవేణి తలతిప్పి కూతురి ముఖంలోకి చూసింది "ఇంకా పడుకోలేదా!"

"నీతో ఒంటరిగా మాట్లాడాలని వెయిట్ చేస్తున్నాను"

దీర్ఘంగా నిశ్వసించాక "హైదరాబాద్ వెళ్ళే విషయమేనా మాట్లాడాల్సింది" అడిగిందావిడ.

తల నిలువుగా ఆడిస్తూ "కానీ వెళ్ళడం గురించి కాదు. నన్ను పంపకూడదని అనుకోవడా



నికి కారణం తెలుసుకోవాలని...అంతే" అంది శ్రావ్య.

అప్పటికి పాత్రలు కడగడం పూర్త య్యింది. వాటిని సర్దేసి బయటకు నడుస్తూ "చూడు శ్రావ్యా! పెద్దల మనసుల్లో ఏదో వుంటుంది. అవన్నీ తెలుసుకోవలసిన అవసరం లేదు. వారి మాట వింటే చాలు" పలికింది. ఆవిడ వంటగది తలుపేసేసింది. పడకగదివైపు అడుగువేయబోతూంటే, శ్రావ్య ఆవిడను పట్టుకుని పెరడువైపు లాక్కెళ్ళింది.

"ప్లీజ్ అమ్మా! అసలు మీ మనసులో ఏముందో నాకు తెలియాలి"

పెరడంతా చీకటిగా వున్నా, వీధి లైటు వెలుగు వారి మీద పడుతోంది. నీలవేణి కూతురి ముఖంలోకి చూసింది. "మా మనసుల్లో ఏముందో తెలుసుకోవడం అంత అవసరమా?"


"అవును"

"అభద్రతాభావం"

శ్రావ్య ఉలిక్కిపడి తల్లి ముఖంలోకి చూసింది. "అ..భ..ద్ర..తా..భా..వం..?!"

"అవునమ్మా! తమ పిల్లలు సంతోషంగా వుండాలని ప్రతి తల్లిదండ్రి కోరుకుంటారు. ఐతే ఆ సంతోషాల వేటలో పిల్లలు ఏం చేస్తారో, ఏ గమ్యాలకు చేరుకుంటారోనన్న భయం నేడు తల్లిదండ్రులకు పెరిగిపోయింది. ఒకవైపు ప్రేమవివాహాలు, మరోవైపు పబ్‌కల్చర్, రెచ్చగొట్టే ఇంటర్‌నెట్‌లు, కలిసి తిరిగే ఇంటిమసీలు...ఏ క్షణం ఎలాంటి వార్త వినవలసి వస్తుందోనన్న భయం చాలామంది తల్లిదండ్రుల్లో అంతర్లీనంగా కదలాడుతోంది. కొందరు ఆ భయాన్ని నొక్కిపెడితే, మరికొందరు ముందుజాగ్రత్తగా పిల్లల్ని కట్టడి చేస్తున్నారు. మేము ఆ రెండో కోవకు చెందినవాళ్ళం"

తన తల్లికేసి అభావంగా చూసింది. "ఒక కోణంలో ఆలోచిస్తే- వాళ్ళు తన వ్యక్తిత్వాన్ని అనుమానిస్తున్నారని అనుకోవచ్చు. కానీ మరో కోణంలో చూస్తే వారిలో కదలాడే అభద్రతాభావం కనిపిస్తోంది. ఇదేదో అనవసరభయం అనడానికి లేదు. వాస్తవ పరిస్థితులేమిటో వారికన్నా తనకే ఎక్కువ తెలుసు. అలాగే ఇది ఏ ఒక్కరి వ్యక్తిత్వాన్నో కించపరిచే వాఖ్య కాదు. నరేలే..అన్ వాంటెడ్ పిల్స్ వాడడంలో హైదరాబాద్ నగరం ప్రథమస్థానంలో వుందని అంటుంటే, అలాంటి వార్తలు చదివే తల్లిదండ్రులు కంగారుపడరా? ఏదేమైనా నేటితరం పిల్లలు పెరిగే వాతావరణం





తాలూకు భయం పెద్దల్లో అభద్రతాభావం కలుగచేస్తున్నదన్నమాట నిజం"

శ్రావ్య తల్లి చేతిలో చెయ్యేసి చెప్పింది. "అమ్మా! ఈ విషయంలో నేను మాట ఇస్తున్నాను. నా చదువును సార్ధకం చేసుకోవడానికి ఉద్యోగం చేస్తానే తప్ప, ఎలాంటి తప్పు చేయను. ఇది నా హామీ. మీరు నమ్మగలిగితే నన్ను హైదరాబాద్ పంపండి. నా వ్యక్తిత్వం మీద నమ్మకం లేకపోతే, మీ ఇష్టం"

నీలవేణి కూతురి ముఖంలోకి కొద్ది క్షణాలు తదేకంగా చూస్తుండిపోయింది.

ooo

"శ్రావ్యా! హైదరాబాద్ చేరాక ఫోన్ చేయమ్మా!" బస్సెక్కిస్తూ చెప్పాడు వేదాచలం.



"అలాగే నాన్నా" నవ్వుతూ చెప్పింది శ్రావ్య.

బస్సు కదిలేవరకూ వున్నారు ఆయన. బస్సు కదిలాక ఆయనకు చెయ్యి వూపి, ఆ తర్వాత రిలాక్స్‌గా సీట్లో వెనక్కువాలింది. హైదరాబాద్‌కి ఉద్యోగానికి వెళ్ళడం తనకెంతో ఆనందంగా వుంది. 'అక్కడకు చేరుకున్నాక ఏ వలలో చిక్కుకోకుండా, తనను తాను కాపాడుకోవలసిన అవసరమూ వుంది. కన్నవాళ్ళను తలదించుకునేలా చేయడం ధర్మం కాదు. తన కూతురు ఎక్కడికెళ్ళినా తలదించుకునే పరిస్థితి తమకు రానివ్వదని భరోసా ఇస్తే, ఏ తల్లిదండ్రులైనా ఆ బిడ్డను అంత రిక్షానికైనా పంపడానికి సిద్ధపడతారు' మనసులోనే అనుకుంది శ్రావ్య.

## మరో సూపర్ హిట్

తెలుగులో ఇలియానా రెండో సినిమా 'పోకిరి' సంచలనాలు సృష్టించింది కదా! అందుకనే కాబోలు ఇప్పుడా చిత్ర దర్శకుడు పూరి జగన్నాథ్ అడగ్గానే కొత్త సినిమాకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది ఇలియానా. రవితేజతో పూరి జగన్నాథ్ నిర్మించే కొత్త చిత్రం 'నేనింతే'లో హీరోయిన్‌గా ఇలియానా నటించబోతోందిట. గతంలో రవితేజ-ఇలియానా జంటగా నటించిన 'ఖతర్నాక్' ఫ్లాప యింది. కానీ ఇప్పుడీ సినిమా విజయాన్ని సాధించవచ్చని అందరూ భావిస్తున్నారు.